సాక్షి నల్లగొండ

బుధవారం : 8 : ఫిబ్రవరి : 2023



విద్యుత్ వెలుగుల్లో పెద్దగట్టు ఆలయ పరిసరాలు

వైభవంగా లింగన్న కల్యాణం

- చంద్రపట్నం వేసి వివాహ మహోత్సవం నిర్వహించిన పూజారులు
- భారీగా తరలివచ్చిన భక్తులు



దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు శ్రీలింగమంతుల స్వామి ఆలయం వద్ద చంద్రపట్నం కార్యక్రమంలో పాల్గొన్న మెంతబోయిన, మున్న, బైకాన్ వంశస్తులు

సూర్యాపేట, చివ్వెంల : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. ఉదయం కాస్త తక్కువగా వచ్చినా మధ్యాహ్నానికి ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జాతరలో మూడో రోజు కార్యక్రమంలో భాగంగా చంద్రపట్నం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు తమ సంప్రదాయ ప్రకారం గుడి ప్రాంగణంలో శ్రీ లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ తంతును చూస్తూ యాదవ కుటుంబాలు, భక్తులు ఓ లింగా.. ఓ లింగా నామస్మరణ చేశారు. మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు.

చంద్రపట్నం ప్రత్యేకత ఇదీ..

మంగళవారం ఉదయం హక్కుదారులైన మున్న, మెంతబోయిన వంశీయులు బైకానుల వారితో చంద్రపట్నం వేయించి లింగమంతులు, మాణిక్యమ్మల కల్యాణం జరిపించారు. కల్యాణానికి అవసరమైన పట్టు వస్త్రాలు, పెళ్లి సామగ్రి మెంతబోయిన వారు తీసుకొచ్చారు. ముందుగా మండపంలో బైకాన్లు వాయిద్యాలు వాయిస్తూ కథలు చెపుతూ చంద్రపట్నం వేసే ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ఆ ప్రాంతంలో దీర్ఘచతురాస్రకారంలో చందనం చల్లారు. దీనిపై పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చపిండి అద్ది 16 అడుగుల చంద్రపట్నం వేశారు. బైకానుల వాయిద్యాల నడుమ దేవరపెట్టెను తీసుకువచ్చి చంద్రపట్నంపై ఉంచారు. పట్నంపై రెండు పోలు ముంతలు పెట్టి చుట్టూ దారం చుట్టారు. వాటి ముందు రెండు మట్టి పాత్రలను ఉంచి నువ్వుల నూనె పోసి జ్యోతులను వెలిగించారు. తర్వాత సంప్రదాయం ప్రకారం యాదవ కులస్తుల పుట్టుక, చరిత్ర, లింగమంతులు, మాణిక్యమ్మల చరిత్రను కథల రూపంలో చెప్పారు. మాణిక్యమ్మ తరఫున మున్న వంశస్తులు, లింగమంతుల తరఫున మెంతబోయిన వంశస్తులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. బైకానులు పురోహితులుగా ఉండి చంద్రపట్నంపై ఉంచిన దేవరపెట్టెలోని లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల విగ్రహ మూర్తులకు కల్యాణం జరిపించారు.

న్యూస్‌రీల్

సీఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తిచేయాలి



మిల్లులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : యాసంగి 2022 – 23 కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ (సీఎంఆర్) త్వరగా పూర్తి చేయాలని మిల్లర్లను అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రైస్ మిల్లులను పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పంట సీజన్‌కు నిల్వ సామర్థ్యం ఏర్పాటు చేసేలా సీఎంఆర్‌ను వేగవంతం చేయాలని సూచించారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌లు సీఎంఆర్ పెండింగ్ మిల్లులను ప్రతి రోజు సందర్శించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల డీఎం నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులో గల టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌ను రాష్ట్ర డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం సందర్శించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు పిల్లలతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. గ్రూప్ 2, 3, 4 కోచింగ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సల్మా భాను, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం, స్టడీ సర్కిల్ డైరెక్టర్ పడిదెల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆలయంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజ నిర్వహించారు. స్వామి వారిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని, పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు.

రేషన్‌లో మనం టాప్

- పెరిగిన తలసరి ఆదాయం
- చిన్నతరహా పరిశ్రమల్లో నల్లగొండ నాలుగో స్థానం
- వంద శాతం కోవిడ్ టీకా
- ప్రైవేట్ పాఠశాలల్లో మన జిల్లాది ఐదో స్థానం
- 16లక్షల జనాభాలో లక్షన్నర మంది రైతులు

సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్-2023లో వెల్లడి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రేషన్ దుకాణాల్లో నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. మిగతా జిల్లాలతో పోల్చితే మన జిల్లాలోనే అత్యధికంగా 991 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అన్న పూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు కలిపి మొత్తంగా జిల్లాలో 4,67,775 కార్డుదారులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 610 రేషన్ షాపులు ఉండగా, 3,25,782 మంది కార్డుదారులు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. గణాంక శాఖ సోమవారం వెల్లడించిన సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్ -2023లో ఈ అంశాలను వివరించింది.

నివేదికలోని మరికొన్ని ప్రధాన అంశాలు..

జిల్లాలో తలసరి ఆదాయం పెరిగింది. 2019–20 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2020–21లో పెరుగుదల నమోదైంది. ప్రస్తుత ధరల ప్రకారం జిల్లాలో తలసరి ఆదాయం రూ.1,97,896 నుంచి రూ.2,04,847కు పెరిగింది. సూర్యాపేట జిల్లాలోనూ తలసరి ఆదాయం రూ.1,73,186 నుంచి రూ.1,75,606కు పెరిగింది.

- ఆదర్శ గ్రామాల్లో జిల్లాలోని నాంపల్లి గ్రామ పంచాయతీ 99.86 శాతం స్కోర్‌తో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలువగా, నల్లగొండ మండలం బుద్దారం గ్రామ పంచాయతీ 99.81 శాతం స్కోర్‌తో 15వ స్థానంలో నిలిచింది.
- గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో మిగతా జిల్లాలతో పోల్చితే మొదటి స్థానంలో మహబూబ్ నగర్ ఉండగా, నల్లగొండ 28వ స్థానంలో ఉంది. సూర్యాపేట 25వ స్థానంలో ఉంది.
- అంగన్‌వాడీ కేంద్రాలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. జిల్లాలోని 2,093 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2012 మంది అంగన్‌వాడీ టీచర్లు ఉండగా, 1709 మంది ఆయాలు ఉన్నారు. 104580 మంది విద్యార్థులు ఉన్నట్లు సర్వే వెల్లడించింది. సూర్యాపేట జిల్లాలోని 1,209 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1155 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1018 మంది ఆయాలు, 68,728 మంది విద్యార్థులు ఉన్నారు.



- ప్రైవేటు పాఠశాలలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి ఉండగా, మూడో స్థానంలో రంగారెడ్డి, నాలుగో స్థానంలో నిజామాబాద్, 451 స్కూళ్లతో ఐదో స్థానంలో నల్లగొండ నిలిచింది. సూర్యాపేట జిల్లా 263 స్కూళ్లతో 13వ స్థానంలో ఉంది.
- వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లలో నల్లగొండ జిల్లా 16వ స్థానంలో ఉంది. 60.82 శాతం గృహ, 19.36 శాతం వ్యవసాయ, 9.89 శాతం పారిశ్రామిక విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 64.34 శాతం గృహ, 13.05 శాతం వ్యవసాయ, 10.82 శాతం పారిశ్రామిక విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి.
- క్రాప్ డైవర్సిఫికేషన్‌లో సూర్యాపేట జిల్లా చివరి స్థానంలో ఉంది.
- 15 నుంచి 18 ఏళ్లలోపు వయస్సు వారికి 100 శాతం కోవిడ్ రెండో డోస్ వ్యాక్సిన్ పూర్తి చేసిన జిల్లాల్లో నల్లగొండ, సూర్యాపేట ఉన్నాయి.



- 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోల్చితే ఖమ్మం జిల్లాలో వ్యవసాయ కూలీలు 4,14,250 మంది ఉండగా, నల్లగొండ జిల్లాలో 3,89,621 మంది ఉన్నట్లు సర్వే తెలిపింది. నల్లగొండ జిల్లాలో 16,18,416 మంది జనాభా ఉండగా, వ్యవసాయం చేస్తున్న రైతులు 1,58,951 మంది ఉన్నట్లు తేల్చింది. ఇక వ్యవసాయ కూలీలు 3,89,621 మంది ఉండగా, గృహ నిర్మాణ రంగంలో కార్మికులు 19,633 మంది, ఇతర పనులు చేసుకునే వారు 2,37,886 మంది మొత్తంగా వివిధ పనులను చేసుకొని జీవించే వారు 8,06,091 మంది (49.8 శాతం) ఉన్నట్లు పేర్కొంది. సూర్యాపేట జిల్లాలో 10,99,560 జనాభా ఉండగా, అందులో రైతులు 98,773 మంది, వ్యవసాయ కూలీలు 3,15,838 మంది ఉన్నారు.



- అత్యధిక పొడవు రోడ్లు కలిగిన జిల్లాల్లో రంగారెడ్డి 7,714 కిలోమీటర్లతో మొదటి స్థానంలో ఉండగా, 7,529 కిలోమీటర్లతో నల్లగొండ రెండో స్థానంలో ఉంది.
- చిన్న తరహా పరిశ్రమల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి తరువాత నల్లగొండ నాలుగో స్థానంలో ఉంది.
- 2015 నుంచి 2023 జనవరి వరకు టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చిన జిల్లాల్లో నల్లగొండ ఐదో స్థానంలో ఉంది.
- ఇతర దేశాలకు రాష్ట్రం నుంచి వెళ్లే గూడ్స్ ఎగుమతుల్లో నల్లగొండ నుంచి 2.45 శాతం గూడ్స్ ఎగుమతి అవుతున్నాయి.



ఫిర్యాదుదారుల సమస్యలకే ప్రాధాన్యం

- ఎస్పీ అపూర్వారావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వారావు

మిర్యాలగూడ అర్బన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ అపూర్వారావు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్లను మంగళవారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయా స్టేషన్ల ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీ తదితరులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు, క్రైమ్ రేట్ గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రౌడీ షీటర్లకు త్వరలోనే కౌన్సిలింగ్ ఇస్తామని, మారని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీ షీట్లు తొలగిస్తామని తెలిపారు. ప్రజలు పోలీస్‌స్టేషన్లకు నిర్భయంగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేయ వచ్చన్నారు. న్యాయం జరగనట్లు భావిస్తే నేరుగా జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణిలో తనను కలిసి విన్నవించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటగిరి, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు రాఘవేందర్, నిగిడాల సురేష్, సత్యనారాయణ, ఎస్‌ఐ సుధీర్‌కుమార్ ట్రాఫిక్ ఎస్‌ఐ కోటేష్ తదితరులున్నారు.

పల్లె ప్రకృతి వనాలకు భూములు గుర్తించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా



వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు మిగిలిన అన్ని పంచాయతీల్లో భూములు గుర్తించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆమె మంగళవారం ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ రాజ్ ఏఈ, అదనపు ప్రోగ్రాం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లేబర్ మొబిలైజేషన్, నర్సరీలు, స్వచ్ఛభారత్ మిషన్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, సోషల్ ఆడిట్ రికవరీస్, క్రీడా ప్రాంగణాలు, హరితహారం, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, సీసీ రోడ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రతి పంచాయతీ నుంచి 25మంది కూలీలు ఉపాధి హామీ పనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ ఆడిట్‌కు సంబంధించిన జరిమానాలను క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి రికవరీ చేయాలని సూచించారు. వేసవి కాలం వస్తున్నందున అన్ని నర్సరీలలో షేడ్ నెట్‌లను అమర్చాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధి అధికారిణి కాళిందిని, పంచాయత్ అధికారి విష్ణు వర్ధన్, పంచాయతీ రాజ్ ఈ.ఈ.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగులకు రాజ్యాధికారం వస్తేనే అభివృద్ధి

- దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్



మామిడాలలో పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహారాజ్

రామగిరి(నల్లగొండ) : బడుగులకు రాజ్యాధికారం వస్తేనే అభివృద్ధి సాధ్యమని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంతో పాటు మామిడాల, ఇండ్లూరులో కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ జెండాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ దేశంలో నివసిస్తున్న సబ్బండ కులాలకు అన్ని రంగాల్లో హక్కులు, అవకాశాలు ఉన్నాయన్నారు. అణగారిన వర్గాలకు అధికారం వస్తే ఉచితంగా విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రమేష్, శ్రీదేవి, శేఖర్, నాయకులు రవికుమార్, గిరి, సైదులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం లేక.. సాగు చేయలేక..

తగ్గుతున్న పప్పు ధాన్యాల పంటల సాగు

- విత్తనాలపై సబ్సిడీ ఎత్తివేతే కారణమంటున్న రైతులు
- సంమృద్ధిగా సాగునీరు, పత్తికి 'మద్దతు' కూడా ఓ కారణమే..



నల్లగొండ అగ్రికల్చర్ : ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఏటేటా పప్పు ధాన్యాల పంటల సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సంమృద్ధిగా సాగునీటి వనరులు, తెల్లబంగారానికి మార్కెట్‌లో లభిస్తున్న మద్దతు ధరతో ఆ పంటల సాగువైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా పప్పుల ధాన్యాల పంటలైన కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి పంటల సాగు గణనీయంగా తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆరుతడి పంటలు సాగు చేసే చందంపేట, పీఏపల్లి, డిండి, దేవరకొండ, చింతపల్లి, మర్రిగూడ, మాల్ తదితర ప్రాంతాల్లో సైతం పప్పుధాన్యం పంటల సాగును రైతులు పూర్తిగా తగ్గించారు. కేవలం పత్తి, వరి పంటల సాగుకే ఆసక్తి చూపుతున్నారు.

సబ్సిడీ లేక..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో కంది, పెసర, మినుము, వేరుశనగ పంటల సాగును ప్రోత్సహించింది. విత్తనాలను సబ్సిడీపై అందించడంతోపాటు యూనివర్సిటీకి చెందిన మినీ కిట్లను కూడా ఉచితంగా అందించేది. దీంతో రైతులు పప్పుధాన్య పంటల సాగుపై మొగ్గు చూపేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వరి, ఇతర పప్పుధాన్య పంటల విత్తనాలపై పూర్తిగా సబ్సిడీని ఎత్తివేసింది. కేవలం రైతుబంధు, రైతు బీమా పథకాల మినహా ఎలాంటి ప్రోత్సాహకాలను అందించకపోవడం పప్పుధాన్యాల సాగు తగ్గిపోవడానికి కారణంగా రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని పప్పు ధాన్య పంటల సాగును పెంచేందుకు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో పప్పుల ధరలు మరింత ఆకాశాన్నంటే ప్రమాదముందని కర్షకులు ఆవేదన్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా పప్పు ధాన్యాల పంటల సాగు ఎకరాల్లో..

సంవత్సరం	సీజన్	వేరుశనగ	కంది	మినుము	పెసర
2017	వానాకాలం	900	19987	235	3140
	యాసంగి	12412	0	340	0
2018	వానాలకాలం	670	15990	0	1160
	యాసంగి	8823	0	313	30
2019	వానాకాలం	1090	14088	350	560
	యాసంగి	11480	0	422	662
2020	వానాకాలం	371	21154	76	1044
	యాసంగి	17530	0	230	757
2021	వానాకాలం	463	10807	8	329
	యాసంగి	37129	28	1214	2213
2022	వానాకాలం	75	3273	38	58
	యాసంగి	16125	5	55	1252

బాలలు కార్మికులుగా మగ్గాల్సిందేనా?

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో మార్పేదీ

- మూడేళ్లలో 397మంది వ్యాపారులపై కేసులు
- కోర్టుల్లోనే పెండింగ్.. శిక్షలు సున్నా
- ఏడేళ్లలో 2,510 మంది బాలలకు విముక్తి
- తాజాగా 82మంది బాల కార్మికుల గుర్తింపు



నల్లగొండ : వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అధికారులు (ఫైల్)

నల్లగొండ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ పేరిట నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్స్ వ్యాపారుల్లో మార్పు తీసుకురావడం లేదని తెలుస్తోంది. ఫలితంగా కొందరు బాలలు కార్మికులుగా మగ్గిపోతున్నారు. యేటా అధికారులు రెండు సార్లు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తూ పనులు చేస్తున్న బాలకార్మికులను గుర్తిస్తున్నారు. పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నా, అవి ఏళ్ల తరబడి కోర్టులో పెండింగ్‌లోనే ఉంటుండడంతో ఖాతరు చేయడం లేదని, అధికారులు గుర్తిస్తున్న బాల కార్మికుల గణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి.

ఏడేళ్లుగా స్పెషల్ డ్రైవ్స్

బాలలు కార్మికులుగా మగ్గిపోతున్న వారిని గుర్తించేందుకు 2015లో ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది. బాలల పరిరక్షణ విభాగం, కార్మిక శాఖ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీగా ఏర్పడి అధికారుల బృందాలు జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో రెండు పర్యాయాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మెకానిక్ షాపుల తోపాటు ఇతర షాపులు, ఇటుక బట్టీలు, తదితర వాటిల్లో కార్మికులుగా పనిచేస్తున్న బాలలను ఈ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తిస్తూ వస్తున్నారు. అలా ఇప్పటి వరకు జిల్లాలో 2,510 మంది బాలలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే, ఇదే క్రమంలో పనిలో పెట్టుకున్న వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు, జరిమానాలతో సరిపెట్టారు.

కేసులన్నీ కోర్టుల్లోనే పెండింగ్

అయితే, వ్యాపారులకు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా వారిలో మార్పు కనిపించకపోవడంతో మూడేళ్లగా అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. అలా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్న 397మంది వ్యాపారులపై కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాగా, తాజాగా జనవరి మాసంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్‌లో సైతం 82మంది బాలలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు బాలల పరిరక్షణ అధికారి గణేష్ తెలిపారు. అయితే, ఇప్పటి వరకు నమోదైన కేసులు కోర్టుల్లోనే పెండింగ్‌లో ఉండడంతో ఈ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యపడడం లేదు. చట్టాలను మరింత కఠినంగా రూపొందించి శిక్షలు అమలు చేస్తేనే ఈ వ్యవస్థను రూపుమాపేందుకు అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్జీ కళాశాల విద్యార్థులు 'అగ్ని వీర్' కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ) : జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలకు చెందిన విద్యార్థులు అగ్ని వీర్ ఆర్మీలో ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యామ్ తెలిపారు. కళాశాలకు చెందిన 25మంది విద్యార్థులు అగ్ని వీర్‌లో ఎంపిక కావడం, అందులో ఎక్కువ మంది ఎన్‌సీసీ కేడెట్లు ఉండడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్నకుమార్, యాదగిరిరెడ్డి, దుర్గాప్రసాద్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, యాదగిరి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పట్నం వేసి.. పెళ్లి చేసి..

పెద్దగట్టులో వైభవంగా చంద్రపట్నం, లింగమంతుల కల్యాణోత్సవం

గంట దీపంతో మొక్కు చెల్లింపు

కోరిన కోరికలు తీర్చే లింగమంతుల స్వామికి జాతర సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. పుట్టు వెంట్రుకలు తీసే క్రమంలో యాదవ సోదరులు గంట దీపంతో మొక్కును చెల్లించుకుంటారు. చిన్నపాటి మట్టి పాత్రలో దీపాన్ని వెలిగించి పుట్టు వెంట్రుకలు తీసే చిన్నారి తలపై పెట్టి గట్టుపైకి వెళ్లి లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లిని దర్శించుకుంటారు. ఈ క్రమంలో ఎడవెల్లి గ్రామానికి చెందిన ఓ భక్తుడు గంట మొక్కు తీర్చుకునేందుకు భేరీచప్పుళ్ల.. లింగమంతుని పాటల నడుమ గట్టుపైకి వెళ్లడం చూపరులను ఆకట్టుకుంది.

నాణ్యత లేని ప్రసాదాలు

సూర్యాపేటక్రైం: పెద్దగట్టు జాతర నేపథ్యంలో వ్యాపారులు భక్తుల వద్ద నుంచి అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దేవస్థానం పక్కనే లడ్డు, పులిహోర విక్రయాల దుకాణం ఉండగా, అధికారులు ఒక్కొక్క లడ్డూను రూ.20కి భక్తులకు విక్రయించాలని సూచించారు. కానీ వ్యాపారులు అవేమీ పట్టించుకోకుండా రూ.100కి 4 లడ్డూలు మాత్రమే ఒకే కవర్‌లో ప్యాక్ చేసి ఇస్తున్నారు. దీనిపై ఓ భక్తుడు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి స్పందన కనిపించలేదు. అంతేకాకుండా లడ్డూ పరిమాణం, నాణ్యతలో కూడా తేడాలు ఉన్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. పులిహోర మరింత పసుపుపచ్చగా కనిపించాలని కెమికల్ పౌడర్‌ను వాడుతున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కి సమాచారం ఇవ్వగా, వచ్చి నామమాత్రంగా తనిఖీ చేస్తున్నారే తప్ప విక్రయదారులపై ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని భక్తులు వాపోతున్నారు.



ప్రసాదాలు విక్రయించే ప్రాంతం

కోనేరుకు తాళం... భక్తుల అసహనం



పెద్దగట్టుపై దేవాలయానికి ఉత్తరపక్క ఉన్న కోనేరులో భక్తులు స్నానాల ఆచరించి స్వామివారిని దర్శించుకునేవారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా గుట్టపై కాకుండా గుట్ట ఉత్తర భాగంలోనే లక్షలు వెచ్చించి గతంలోని కోనేరును నిర్మించారు. ప్రస్తుతం ఈ కోనేరుకు రంగులు వేసి మంచినీటిని నింపి సుందరంగా తీర్చిదిద్దినప్పటికీ... భక్తులకు అందుబాటులోకి తీసుకు రాలేదు. కోనేరులోకి వెళ్లే గేట్లకు తాళాలు వేయడంతో కోనేరు కట్టింది దేనికంటూ భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



పెద్దగట్టు జాతర వద్ద రాత్రి సమయంలో భక్తుల సందడి



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



లింగమతుల స్వామికి కోడి పుంజు మొక్కు చెల్లించుకుంటున్న యువతి

భానుపురి (సూర్యాపేట): తెలంగాణలోను రెండో అతిపెద్దది అయిన పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. సోమవారం మూడో రోజు కూడా భక్తులు తమ చుట్టాలు, కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సందడితో పెద్దగట్టు పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

దుకాణాల వద్ద భక్తుల కిటకిట

జాతరలో వెలిసిన దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఎక్కువగా మహిళలు గాజుల షాపుల తోపాటు, అలంకరణ వస్తువుల వద్ద బారులుదీరారు. జాతర గుర్తుగా గాజులు వేయించుకోవడంతో పాటు, బంధువులకు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

నిరంతర వైద్య సేవలు

జాతరకు వచ్చే భక్తులకు చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స వైద్య సేవలు అందిస్తున్నారు. గట్టుకు నాలుగు దిక్కులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల వద్ద కరోనాపై అవగాహన కల్పించడమే కాకుండా, మాస్కులు పంపిణీ చేస్తున్నారు.



చంద్రపట్నం వేస్తున్న యాదవులు

అపరిశుభ్రంగా పరిసరాలు

లింగమంతుల స్వామి జాతరలో మూడో రోజు పారిశుద్ధ్య సిబ్బంది చేతులెత్తేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంతో భక్తులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదటి రెండు రోజులు పక్కా ప్రణాళికతో పని చేసిన పారిశుద్ధ్య సిబ్బంది మూడో రోజు అంతగా దృష్టి పెట్టలేదు.

గొంగళి వ్యాపారుల సందడి

జాతరలో యాదవుల సంప్రదాయ దుస్తులను విక్రయిస్తున్నారు. జీవాలను కాసేవారు ఎండ, వాన, చలి నుంచి రక్షణ పొందడానికి గొంగళిని ఉపయోగిస్తారు. దీంతో జాతర వద్ద వ్యాపారులు గొంగళ్లు విక్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కో గొంగళి రూ.800 నుంచి వెయ్యి వరకు పలుకుతోంది. వీటిని కొనుగోలు చేసేందుకు యాదవులు ఆసక్తి చూపుతున్నారు.



చంద్రపట్నం వద్ద దేవరపెట్టె



బందోబస్తులో ఉన్న పోలీసులు



జాతర వద్ద ఫొటో తీస్తున్న యువతి

హలో.. వినిపిస్తుందా..?

సూర్యాపేటక్రైం : పెద్దగట్టు జాతరలో సెల్‌ఫోన్లు పనిచేయక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేల సంఖ్యలో సెల్‌ఫోన్లు ఒకే టవర్ కిందికి రావడంతో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫోన్లు కలవకపోవడంతో ఒకరినొకరు కలుసుకోలేక మైకు ప్రకటనలను సంప్రదిస్తున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ ఫోన్లు మాత్రమే కొంత వరకు పనిచేశాయి. అయితే, అందరి చేతుల్లోనూ స్మార్ట్ ఫోన్లు ఉన్నప్పటికీ మాట్లాడుకోడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్తే గానీ సిగ్నల్స్ దొరకడం లేదు.



స్వామికి బోనం వండుతున్న వృద్ధురాలు

తెలంగాణ సంస్కృతిని కాపాడటమే ధ్యేయం

- పెద్దగట్టు జాతర ఏర్పాట్లలో ప్రభుత్వ శాఖల పనితీరు భేష్
- మంత్రి జగదీశ్‌రెడ్డి



కుటుంబ సమేతంగా పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల (సూర్యాపేట): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా పెద్దగట్టు జాతరకు హాజరై లింగమంతుల స్వామి వారికి నిర్వహించిన చంద్రపట్నం, కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 12లక్షల మందికి పైగా భక్తులు జాతరలో పాల్గొన్నారని తెలిపారు. మరో రెండు రోజులు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని.. దానికి అనుగుణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు సమష్టిగా పనిచేస్తూ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటున్నారని కితాబిచ్చారు. లింగమంతుల స్వామి దయతో తెలంగాణ అభివృద్ధి మరింత పురోగమించాలని ఆకాంక్షించారు. అనంతరం జాతర నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీసు కంట్రోల్ రూంను పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసు శాఖ చేపట్టిన నిఘా గురించి సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ఉద్యోగులతో ఫొటోలు దిగారు.



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

- భూ వివాదంలో దుర్భాషలాడడంతో మనస్తాపం చెందిన వ్యాపారి
- మోత్కూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఘటన

మోత్కూరు: భూ వివాదంలో అకారణంగా తన ఇంటికి వచ్చి బూతులు తిట్టారని మనస్తాపానికి గురైన ఓ వ్యాపారి పోలీస్ స్టేషన్ ఆవరణలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన శ్యాంసెట్టి రమేష్ గతంలో శివరాత్రి లింగయ్య వద్ద రెండు గుంటల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని రమేష్ తిరిగి లింగయ్య కుమారులకు విక్రయించాడు. లింగయ్య పెద్ద కుమారుడు వెంకటేష్‌కు రెండు గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసేటట్లు బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చాడు. అనంతరం గ్రామంలో జరిగిన భూ పంచాయతీలో లింగయ్య కుమారులు ఇద్దరికి చెరొక గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేసేటట్లు ఒప్పందం చేసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ క్రమంలో వెంకటేష్‌కు గతంలో రాసి ఇచ్చిన బాండ్ పేపర్ చెల్లదని పెద్ద మనుషులు తీర్మానం చేశారు. ఈ విషయంపై కొంతకాలంగా లింగయ్య పెద్ద కుమారుడు వెంకటేష్ రమేష్ మధ్య గొడవ నడుస్తుంది. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి వెంకటేష్ మద్యం మత్తులో రమేష్ ఇంటికి వచ్చి తనకు రెండు గుంటలు రిజిస్ట్రేషన్ చేయాలని నానా బూతులు తిట్టడంతో రమేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని ఓ షాపులో పురుగు మందు కొనుగోలు చేసి బైక్‌పై పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లెంకల వేణుతో పాటు మరికొంత మంది పెద్ద మనుషులను పోలీస్ స్టేషన్‌కు రమ్మని లింగయ్య కుమారులపై ఫిర్యాదు చేయాలని రమేష్ పిలిపించాడు. పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లక ముందే రమేష్ తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. దీంతో పెద్ద మనుషులు రమేష్‌ను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పోలీస్ స్టేషన్‌లో కొండగడప భూ వివాదానికి సంబంధించిన ఎలాంటి ఫిర్యాదు అందలేదని, స్టేషన్ ఆవరణలో పురుగు మందు తాగినటువంటి సంఘటన కూడా చోటు చేసుకోలేదని ఎస్‌ఐ వంగాల జానకిరాంరెడ్డి తెలిపారు.

ఆడ శిశువును సాకలేక..

- బంధువులకు ఇచ్చిన తల్లిదండ్రులు
- విషయం తెలుసుకుని విచారణ చేపట్టిన ఐసీడీఎస్ అధికారులు
- పాప హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తింపు
- ఈ నెల 11న పాపను అప్పగిస్తామని తల్లిదండ్రుల హామీ



మాచనపల్లి గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మిర్యాలగూడ: ఆ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడో కాన్పులో సైతం ఆడ శిశువు జన్మించడంతో సాకలేక పసిపాపను తమ బంధువులకు ఇచ్చిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని మాచనపల్లి గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మాచనపల్లి గ్రామానికి చెందిన గన్నెపాక మహేష్, కవిత భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉండగా, మూడో కాన్పులో భాగంగా గత నవంబర్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కవిత మరోసారి ఆడ శిశువు జన్మనిచ్చింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత స్వగ్రామానికి వెళ్లిన మహేష్, కవిత దంపతులు.. గత నెలలో మిర్యాలగూడలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉన్నారు. తిరిగి ఈ నెల స్వగ్రామానికి తిరిగి వచ్చారు. అయితే మహేష్, కవిత దంపతుల మొదటి ఇద్దరి ఆడపిల్లలను నాయనమ్మ వెంకటమ్మ అంగన్‌వాడీ పాఠశాలకు పంపించగా, అక్కడ అంగన్‌వాడీ టీచర్ మీ మూడో మనుమరాలు బాగుందా అని వెంకటమ్మను అడిగింది. దీంతో పాపను సాదుకోమని తమ బంధువులకు ఇచ్చామని వెంకటమ్మ చెప్పడంతో అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్ కలిసి మహేష్ ఇంటికి వెళ్లి పాప విషయంపై ఆరా తీశారు. పాపను తమ సమీప బంధువులకు ఇచ్చామని మహేష్ చెప్పడంతో అంగన్‌వాడీ టీచర్ వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించింది. దీంతో మంగళవారం ఐసీడీఎస్ అధికారిణి నాగమణి, ఐసీపీఎస్ అధికారిణి రమణి మహేష్ ఇంటికి వెళ్లి విచారించగా పాప ప్రస్తుతం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉందని తెలిసింది. ఈ నెల 11న పాపను అప్పగిస్తామని మహేష్, కవిత దంపతులు అధికారులకు హామీ పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పసి పిల్లలను ఇతరులకు విక్రయించకూడదని అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



నరేందర్‌రెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిగూడెం వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం బైరోనిబండ గ్రామానికి చెందిన దండ నరేందర్‌రెడ్డి(46) చిట్యాల నుంచి తన డీసీఎంలో సిమెంట్ దిమ్మెల లోడుతో నల్లగొండకు బయల్దేరాడు. మార్గమధ్యలో ఎల్లారెడ్డిగూడెం శివారులో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో దండ నరేందర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

నకిరేకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డులో నివాసముంటున్న ఎనగల్ల రాము(41) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాము గత నెల 31న నకిరేకల్ నుంచి తన స్నేహితుడు జానితో కలిసి బైక్‌పై నల్లగొండకు వెళ్తుండగా మార్గమధ్యలో తాటికల్ వద్ద వృద్ధాశ్రమం సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. రాము పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

దేవరకొండ: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాత్లావత్‌తండా(పి)కు చెందిన వాంకుడావత్ రవి(38) అదే తండాకు చెందిన వాంకుడావత్ కోట్యతో కలిసి తండా శివారులో గల బొడ్డుపల్లి చెరువు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత కోట్య పక్కనే ఉన్న చేను వద్దకు వెళ్లి వచ్చేసరికి అప్పటికే చెరువులో రవి విగతజీవిగా కనిపించాడు. దీంతో విషయాన్ని రవి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పున్న కైలాస్ నేత



పాదయాత్రలో పాల్గొన్న కైలాస్‌నేత

మునుగోడు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ములుగు జిల్లాలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో మునుగోడుకు చెందిన టీపీసీసీ కార్యదర్శి పున్న కైలాస్‌నేత మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా రాజకీయ పరిస్థితులను రేవంత్‌రెడ్డికి వివరించారు.

అంబులెన్స్ బోల్తా



రోడ్డు పక్కన బోల్తాపడిన అంబులెన్స్

మద్దిరాల: మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులో 365వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో మంగళవారం అంబులెన్స్ బోల్తాపడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు రోగులను తీసుకొచ్చిన అంబులెన్స్ తిరుగు ప్రయాణంలో రెడ్డిగూడెం శివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



పోచంపల్లి శ్రీనివాస్ (ఫైల్)

బొమ్మలరామారం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సోలీపేట్ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలీపేట్ గ్రామానికి చెందిన పోచంపల్లి శ్రీనివాస్ (45) తన కుల వృత్తిలో భాగంగా గ్రామంలోనే ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంతకాలంగా కుల వృత్తిలో ఉపాధి కరువవ్వడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారం కావడంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన శ్రీనివాస్ ఆదివారం కుటుంబ సభ్యులు బంధువుల పెళ్లికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మంగళవారం ఇంటికి వచ్చి చూడగా శ్రీనివాస్ ఉరి వేసుకొని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తమ్ముడు పోచంపల్లి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

అప్పుల బాధతో వ్యవసాయ కూలీ..




రాములు మృతదేహం

నల్లగొండ క్రైం: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన అన్నపూరి రాములు(50) అప్పుల బాధతో మంగళవారం తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాములు తన అవసరాల నిమిత్తం రూ.3లక్షల అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మద్యం సేవించి తన ఇంటి సమీపంలో చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రేకుల షెడ్డు కూలడంతో కూలీ మృతి

- మరో ఇద్దరికి గాయాలు



సోహెల్ మృతదేహం

మిర్యాలగూడ టౌన్: రేకుల షెడ్డు కూలడంతో కూలీ మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సోహెల్(23), బిలాల్, షహబాజ్ జీవనోపాధి కోసం మిర్యాలగూడకు వలస వచ్చి యాద్గార్‌పల్లి గ్రామంలోని వసుంధర రైస్ ఇండస్ట్రీస్‌కి అనుసంధానంగా ఉన్న పాత రేకుల షెడ్డు పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు కలిసి షెడ్డులో బొల్టులు బిగిస్తుండగా ఒక్కసారిగా షెడ్డు కుప్పకూలి వీరిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా సోహెల్ మృతిచెందాడు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సోహెల్ మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, సమాచారం తెలియగానే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించామని మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపారు.